# సో-హం తత్త్వమే త్రిమూర్తి తత్త్వము

బ్రహ్మ సృష్టిచేయు బ్రహ్మాండమంతయు
విష్ణువన్నిపెంచి వృద్ధిచేయు
పరమశివుడు ద్రుంచు పాపిష్టి జీవుల
ఉన్నమాట తెలుపుచున్నమాట

ప్రేమస్వరూపులారా!

ఈ విశాలప్రపంచమందు, అనంతమైన విషయములందు, అగాధమైన చింతలయందు, అసంతృప్తిచెందుతున్న మానవులు దేనిని వెతుకుతున్నారు? దేనికోసమై వారి తపస్సు? కొందరు ప్రాకృతమైన చింతల నిమిత్తమై, మరికొందరు అప్రాప్య నిమిత్తమైన చింతలతో కాలమును వ్యర్థము చేయుచున్నారు. ఆధ్యాత్మిక మార్గమందు అనేకమంది దైవాన్ని దర్శించాలని, దైవాన్ని స్మరించాలని దైవముతో సంభాషించ వలెనని చింతించుచున్నారు. భగవంతుడంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపులుగా మానవులు చింతిస్తున్నారు. కానీ, ఈ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఆకార మానవులు కాదు. వీరికి ఆకారములు లేవు, ఆధారములు లేవు. ఇటువంటి భావనవలన లభించే ఆనందముకూడా లేదు. అయితే, ఈ మువ్వురూ ఏ ఆకారములో ఉన్నారని విచారణచేస్తే ఉపాధులులేని గుణాకారులై ఉన్నారు. ఏమిటి ఈ ఆకారములు? 'ఈశ్వరస్సర్వ భూతానాం' అన్నారు. ఈశ్వరుడు అన్ని భూతముల యందు ఉంటున్నాడు. కానీ ఏ ఆకారముతో ఉంటున్నాడు? ఆకారము తెలియని రూపము చింతించి ఏమి ప్రయోజనము? ఈశ్వరత్వమనగా సాక్షాత్తు మానవుల యందు కనిపించే, వినిపించే, మైమరపించే దివ్యమైన శ్వాసయే. ఈ శ్వాసయొక్క శబ్దము ఏవిధంగా మనకు గోచరిస్తున్నది? ఈ శబ్దమే ఆకారముగా అనుభవించాలంటే ఏమిచేయాలి? ఉపనిషత్తులలో ఇటువంటి ప్రశ్నలకు సమాధానము లభిస్తుంది. దీనినే ఉపనిషత్తులు బ్రహ్మ లేక ఆత్మ అని వర్ణించాయి. అయితే, ఇలాంటి ఆకారరహితమైన పదములు ఎన్ని చెప్పినా మానవునికి అర్థము కాదు.

sri sathyasai vachanamrutam

మానవుని శ్వాసనుండి ఆవిర్భవించిన సో-హం తత్త్వమే దైవత్వము

శబ్దమునకు ఆకారము ఏమిటి? ఇట్టి శబ్దబ్రహ్మమైన ఈశ్వరత్వాన్ని ఏ ఆకారంగా చూపించాలి? అసలు ఈశ్వరత్వమనగా అర్థమేమిటని విచారిస్తే 'మంగళకరమైన శ్వాస' అని అర్థము. ఇట్టి మంగళకరమైన శ్వాస మనకు ఏవిధంగా ప్రాప్తిస్తున్నది. ఈశ్వరత్వము మానవుని శ్వాసనుండి వెలువడే "సో-హం" అనే శబ్దముతో మనకు గోచరిస్తున్నది. అనగా "సో-హం" అనే శబ్దమే భగవంతుని ఆకారము అన్నారు. ఈ శబ్దము ఈశ్వరత్వమును నిరూపిస్తూ ఉంటున్నది. మనము శబ్దమును గుర్తించుకొనక కేవలము ఆకారమును మాత్రమే లక్ష్యమునందుంచుకొని ఈ శబ్దముయొక్క అర్థము ఏమని విచారణచేస్తే ఏమీ గోచరము కాదు. కనుక, దీనికి ఒక ఆకారము నిర్ణయించాలి. గుణాకారమే ఈశ్వరత్వమునకు సరైన ఆకారము. అనగా సాత్త్వికమైన గుణమే "సో-హం" ఈ సాత్త్వికమైన గుణమే ఈశ్వరత్వము. అదే శ్వాసనుండి మరొకటి కూడ ఆవిర్భవిస్తున్నది. అదియే విష్ణుత్వమని చెప్పబడుతున్నది. ఆ విష్ణుత్వమునకు ఆకారము ఏమిటి? మనస్సుయొక్క భావమే. ఇది "సో-హం" అనే శబ్దమునుండి ఆవిర్భవించిన మనోతత్త్వమే. ఈ "సో-హం" నుండియే అన్నిరకములైన శబ్దములు ఆరంభమౌతున్నాయి. ఈ శబ్దము మనస్సుయొక్క ఆకారముగా నిరూపిస్తున్నది. ఇతనే విష్ణువు అన్నారు. అనగా మనసే విష్ణువని భావము. ఈ విష్ణువు నాభినుండి బ్రహ్మ అని మరొక ఆకారము ఆవిర్భవిస్తున్నది. కనుక, ఈశ్వరత్వము, బ్రహ్మత్వము, విష్ణుత్వము అనే మూడు తత్త్వములు సో-హం తత్త్వమునుండియే ఆవిర్భవిస్తున్నాయి. ఈశ్వరత్వముతో ప్రారంభిస్తే మనస్సుయొక్క తత్త్వమే విష్ణుత్వాన్ని నిరూపిస్తున్నది. ఈ శ్వాసనుండి వచ్చే దైవత్వము బ్రహ్మత్వంగా వచ్చింది. ఇదియే వాక్స్వరూపమును ధరించింది. అనగా మన వాక్కునుండి వచ్చేది బ్రహ్మత్వమే. ప్రతివాక్కూ బ్రహ్మత్వమే. ప్రతి సంకల్పము విష్ణుత్వమే. ప్రతి శ్వాస ఈశ్వరత్వమే. కనుక, ఈశ్వరత్వమే శ్వాస; మనస్సు విష్ణుత్వము; ఈ విష్ణువునుండి ఆవిర్భవించిన బ్రహ్మత్వమే నిజమైన వాక్కు. కనుక, దైవత్వమనగా మనశ్వాసనుండి ఆవిర్భవించిన "సో-హం" తత్త్వమే. అది ఎప్పటికీ ఏనాటికీ మనలను వదలిపోదు. మనము దేహముతో ఉండినంతవరకు శ్వాస ఆవిర్భవిస్తూనే ఉంటుంది. మనస్సు, సంకల్ప వికల్పములతో కూడినది. ఇదే విష్ణుత్వము. విష్ణుత్వము నాభినుండి వచ్చిన తత్త్వమే బ్రహ్మత్వము. ఈ బ్రహ్మత్వమునకు మూలకారణము

sri sathyasai vachanamrutam

ఏమిటి? శబ్దము ఆకర్షించునది ఈ బ్రహ్మత్వము.

## పరిశోధన సల్పినపుడే పరతత్త్వము అర్థమవుతుంది

శబ్దబ్రహ్మమయీ, చరాచరమయీ, వాఙ్మయీ అంటారు. దుర్గ, లక్ష్మి, సరస్వతి ఈ ముగ్గురు మూడింటియొక్క ఆకారములే. ప్రతిమానవునియందు శ్వాస ఆడే సమయములో "సో–హం, సో–హం" అనే శబ్దము వస్తుంది. ఇది లేకుండ శ్వాస ఉండటానికి వీలులేదు. అలాగే మనస్సు అనే సంకల్పములేకుండా మాట అనేది రాదు. కనుక, మన శ్వాసనుండి వచ్చే "సో–హం", మనస్సులోని సంకల్పము మరియు సంకల్పమునుండి వచ్చిన వాక్కు – ఈ మూడింటియొక్క ఏకత్వమే అవినాభావసంబంధము, అన్యోన్య ఆశ్రయము. ఇటువంటి తత్త్వాన్ని గుర్తించుటకు మనము ప్రయత్నములు సలపాలి. ఇది సాధనలవల్ల లభించేది కాదు. విచారణవల్ల లభించేది కాదు. పరిశోధనలవల్ల లభించేది. పరిశోధనలు సల్పినపుడే పరతత్త్వము మనకు అర్థము అవుతుంది. ప్రమాణపూర్వక సత్యాన్ని, సత్యస్వరూపకమైన నిత్యాన్ని, ఆనందపరమైన సమత్వాన్ని, ఈ మూడింటియొక్క ఏకత్వాన్ని మానవుడు గుర్తించుటకు ప్రయత్నించాలి. మానవుడు ఈనాడు ఉపనిషత్తులు ఎన్నియో చదువుచున్నాడు. ఉపనిషత్తులయొక్క సారము ఏమిటి? ఉపనిషత్తుల సారము నీయొక్క నిజతత్త్వాన్ని బోధించడమే; అనేకత్వములోనున్న ఏకత్వమును నిరూపించడమే. దేహమును పోషిస్తున్నాము. దేనినిమిత్తమై పోషిస్తున్నాము? ఈ పోషించడంవలన లభించే ఫలితమేమిటి? ఏ మాత్రమూ లేదు. దేహమున్నంతవరకు భుజించాలి. భుజించినంతవరకు నిద్రించాలి. నిద్రించినంతవరకు కూడా ఆనందమును పొందాలి. తదుపరి లేచినతర్వాత ఈ ఆనందం ఎక్కడిది. కనుక, ఈ ఉపనిషత్తుల సారమును మనము గ్రహించాలి. భగవంతునకు ఎట్టి పేర్లు లేవు. అన్ని పేర్లూ తనవే. అన్నిపేర్లయందు తానే యున్నాడు. తనది కానిది తాను లేనిది, ఎక్కడా మనకు కనిపించదు.

## హృదయమే వేదము, సంకల్పములే శ్రుతులు

ప్రేమస్వరూపులారా! ముఖ్యముగా భగవంతుని తత్త్వము ప్రేమయే. ఇట్టి ప్రేమతత్త్వాన్ని గుర్తించుటకు ఈనాడు ఎవరూ ప్రయత్నించటంలేదు. దేహములో ఎన్నియో రకములైన యంత్రములుంటున్నవి. ఈ యంత్రములను ఎన్ని విధముల పరిశోధన చేసినా దీని

sri sathyasai vachanamrutam

అంతరార్థమును గుర్తించుకోలేవు. అయితే, అన్నింటికీ మెయిన్ స్విచ్ ఒకటి ఉన్నది. కన్నులు చూస్తున్నాయి. అనేక కాంతులు మనకు కన్పిస్తున్నాయి. నాలుక అనేక పదార్థములయొక్క రుచులను తెలుపుతోంది. చెవులు అనేకరములైన శబ్దములు వింటున్నాయి. వీటన్నింటికి మూలాధారము ఏమిటి? దీనినే Fundamental Principle అని అన్నారు. ఆ Fundamental Principle అన్నింటికి ఆధారము. దీనినే మనము "ఆత్మ" అన్నాము. ఈ ఆత్మతత్త్వముచేతనే మన హృదయమునుండి అనేక విధములైన సంకల్పములు, భావములు ఆవిర్భవిస్తున్నాయి. ఈ హృదయమనేదే వేదము. ఈ సంకల్పములే శ్రుతులు. ఈ శ్రుతులనుండి వచ్చే అంతరార్థములే వేదాంతము. కనుక, వేదములు ఎక్కడో ఉన్నాయని మనము భావించుకోకూడదు. సర్వత్రా ఉండిన ఈ శబ్దములు మనవెంటనే కంటనే జంటనే ఉంటున్నాయి. కనుక, మన హృదయమనే వేదమునుండి శబ్దములనే నాదములను గుర్తించుకుంటూ రావాలి. ఇట్టి పదములను గుర్తించుటకు తగిన ప్రయత్నము చేయాలి. ఈ పదములయొక్క అంతరార్థములే వేదాంతము. "సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి" అన్నారు. దీని అంతరార్థము మనము చక్కగా గుర్తించుకుంటే అప్పుడే మనకు ఈ వేదార్థము గోచరమవుతుంది. గతమూడు రోజులుగా ఉదయముపూట పూర్ణచంద్ర ఆడిటోరియంలో పండితులు మంత్రములను అనేక రకములైన స్వరములతో ఉచ్చరించడం మీరు గమనించి ఉంటారు. ఆ శబ్దములు వింటుంటే ఒకవిధమైన ఆనందము కలుగుతుంది. పదములు వింటుంటే ఆనందము కలుగుతుందికానీ ఆపదములయొక్క అర్థము మనకు బోధపడదు. అర్థములను గురించి బాధపడి ప్రయోజనం ఏమిటి? ముందుగా శబ్దమును గుర్తించండి. ఈ పదములకు ఎన్ని రకములైన అర్థములో ఉంటుంటాయి. ఈనాడు నానార్థములందు అనర్థములను తీసుకొని యథార్థమును విస్మరిస్తున్నారు. యథార్థమును విస్మరించటంచేత మనకు సత్యతత్త్వము గుర్తించుటకు వీలులేకుండా ఉంది.

పరమాత్మ తత్త్వమే ప్రకృతి రూపములో గోచరిస్తుంది

ప్రేమస్వరూపులారా! విద్యార్థులారా!పదములు మనకు అర్థము కాలేదని వదలకూడదు. విచారణలో ప్రవేశించాలి. ఆ విచారణ ప్రేమతత్త్వమును అనుసరించి యుంటుంది. కనుక,

మనం విచారణ చేయాలంటే మనభావములను పరిగణనలోనికి తీసుకోవాలి. నిన్నటిదినము చెప్పాను. ఏ పదార్థమునందుగానీ దాని సహజతత్త్వము ఎక్కడనుండి వస్తున్నది. అది మానవుడు ఉద్భవింపచేసినది కాదు. స్వతస్సిద్ధముగానే ఆవిర్భవించినది. చెరకులోపల తీపి ఎక్కడనుంచి వచ్చింది? మిరపలోపల కారము ఎక్కడనుండి వచ్చింది? వేపలోని చేదు ఎక్కడనుండి వచ్చింది? మల్లెలోని సువాసన ఎక్కడినుండి వచ్చింది? ఇవన్నీ ప్రకృతి తత్త్వములనుకుంటారు. కాదు. పరమాత్మయొక్క తత్త్వమే. ఈ ప్రకృతి స్వరూపకంగా కనిపిస్తున్నది. ఈ ప్రకృతి తత్త్వాన్ని మనము చక్కగా అర్థముచేసుకోవాలి. ప్రకృతిలో అనేక రకములైన భావాలుంటున్నాయి. అనేక రకములైన భేదములుకూడా ఉంటున్నాయి. అనేక రకములైన అర్థములు కూడా ఉంటున్నాయి. ఇలాంటి పరమాత్మ తత్త్వమైన ప్రకృతిని మనము అర్థము చేసుకోవటం అసాధ్యము. కనుక, పరమాత్మునియొక్క తత్త్వము అర్థముచేసుకోవాలంటే పరతత్త్వములో మనమనస్సును ప్రవేశపెట్టాలి. మనస్సు ఎక్కడినుంచి వస్తున్నది? సంకల్ప వికల్పములనుండియే వచ్చింది. ఆ సంకల్ప వికల్పములు తిరిగి నీ శ్వాసనుండియే వచ్చాయి. దాని తరువాత మనము శబ్దమును గురించి విచారించాలి. అదియే నిజమైన బ్రహ్మతత్త్వము. ఆ బ్రహ్మతత్త్వములోని సో-హం తత్త్వమే నిజమైన ఆత్మతత్త్వము.

### "సో-హం" అనేది బ్రహ్మ తత్త్వమే

ఆత్మతత్త్వమును అర్థము చేసుకోవాలంటే శ్వాసతత్త్వమును ముందుగా మనము విచారించుకోవాలి. ఈ శ్వాసనుండి వెలువడే "సో-హం" లేకపోతే జీవితమే లేదు. కనుక, మనము జీవించేది "సో-హం" తత్త్వమును అర్థముగావించుకొనుట కొరకే. దీని అర్థము ఏవిధంగా ఉంటుంది? "సో-హం" దీనినే 'హంసగాయత్రి' అని చెప్పారు. 'సో' అంటే అది. 'హం' అనగా నేను. అనగా 'అది నేను'. అది నేను అంటే ఏది? అక్కడ ఏది ఉన్నది? 'అది నేను' అనటానికి అక్కడ మనస్సు ఉన్నది. ఈ మనస్సే నేను అనుకుంటే సాధనకు మనస్సు అడ్డుతగులుతున్నదే! కాబట్టి మనస్సు నేను అనుకుంటే, మనస్సు కేవలం ఒక పిచ్చికోతి వంటిది అంటారు. అలాంటి మనస్సును నమ్ముకొని నీవు ఏ మార్గమున పోగలవు. కాదు.. కాదు మనస్సును మనస్సుగా భావించకూడదు. మనస్సును దైవంగా మనము విశ్వసించాలి.

srisathyasai vahamrutam

మనస్సే విష్ణుస్వరూపము. ఆ మనస్సే లేక శ్వాస లేదు. ఆ శ్వాస ఆడటంచేత శబ్దము ఆవిర్భవిస్తున్నది. ఈ శబ్దం రావటంచేత శబ్దబ్రహ్మ ప్రాప్తిస్తున్నది. ఈవిధమైన అంతరార్థములు గోచరించడానికి ఏమి చేయాలి. విచారణ చేయాలి. మనము ధ్యానములో కూర్చున్నప్పుడు "సో-హం" వస్తున్నది. దీనిని గమనించాలి. ఏది 'సో', ఏది 'హం'? దేనినుండి 'సో' వస్తున్నది. దేనినుండి 'హం' అనేది దిగుతున్నది. ఒకటి పోవటం. ఒకటి రావటం. ఈ వచ్చిపోయే శబ్దములను గుర్తించుకుంటూపోతే, ఒకటి లోపలికి పోతున్నది. అదియే 'సో' అనగా దివ్యత్వము రెండవది. 'హం' అనగా అహంకారము బయటకు పోయేది. కాబట్టి, బయటకు పోయేదానిని మనము వదలిపెట్టాలి. లోపలపోయి ప్రాణమునందించేదానిని గట్టిగాపట్టుకోవాలి. ప్రాణాయామ సాధనచేసేవారు "రేచక, పూరక, కుంభక" మనే పదాలు ఉపయోగిస్తారు. 'సో' అని ఒక ముక్కునుంచి గాలిని లోపలికి తీసుకోవాలి. రెండవ ముక్కునుండి 'హం' అంటూ వదలాలి. ఈ రెండింటికి మధ్య కొంతసేపు గాలిని నిల్పుకోవాలి. ఈ మూడు ప్రక్రియలకు కాలమును ఆధారము చేసుకోవాలి. కాలముయొక్క ప్రమాణము మనము గుర్తించుకొనకుండా ఇష్టము వచ్చినట్లుగా చేస్తే ఇది ప్రాణాయామముకాదు, ప్రాణానికి అపాయమే అవుతుంది. 'సో'అనేది ఎంతకాలము నీవు తీసుకుంటున్నావో అంతకాలము నీవు వదలాలి. భగవంతుని 'కాలస్వరూపాయనమః' అని వర్ణిస్తారు. "సో-హం" అనేది బ్రహ్మతత్త్వమే. కాలస్వరూపమైన బ్రహ్మతత్త్వాన్ని కాలానుగుణంగా సాధించాలి. ఈ కాలానుగుణ్యంగా నడచుకోవటంలోపల కర్తవ్యమును గుర్తించుకుంటూ రావాలి. కర్తవ్యము అంటే ఏమిటి? అదే మనస్సుయొక్క సంకల్పము. కాబట్టి, మనస్సు ఎట్టిసంకల్పములు కలిగియుంటున్నదని విచారించాలి. సాత్వికమైన, పవిత్రమైన సంకల్పాలు తెచ్చుకుంటే అప్పుడు కర్తవ్యమౌతుంది. విష్ణువును సాత్వికుడు అన్నారు. కనుక, మన సంకల్పములు సాత్వికమైన సంకల్పములు కావాలి. ఈ సాత్వికమైన సంకల్పములు ఆవిర్భవించాలంటే ఉచ్ఛ్వాస నిశ్వాసములు పవిత్రమైన రీతిలో నడచాలి. కాబట్టి, ఈ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అన్యోన్య ఆశ్రయములు అవినాభావ సంబంధములు కేవలం పేర్లతో వచ్చినవి కాదు. పవిత్రతతో చేరేవి. ఏకత్వములో లీనమయ్యేటటువంటివి. ఇలాంటి ఏకత్వాన్ని గురించిన తత్త్వాన్ని మనం అర్థం చేసుకోవాలి.

sri sathyasai vahini vachanamrutam

## ఆత్మ, మనస్సు, వాక్కుల ఏకత్వమే త్రిమూర్తుల తత్త్వం

ఉపనిషత్తులు దివ్యత్వమును ఎన్నిరకాలుగానో వర్ణిస్తూ ఉంటాయి. వాటి అంతరార్థమును ఎవరూ గుర్తించుకోలేకపోతున్నారు. ఉపనిషత్తులలోని ఒక్కొక్క శ్లోకముయొక్క అంతరార్థమును బోధించాలంటే ఒక నెల టైము తీసుకుంటుంది. అనగా ఏమిటి? అనేక అర్థములతో కూడినటువంటివి ఉపనిషత్తులు. కనుక, సమయసందర్భానుసారముగా తగిన అర్థము తీసుకోవాలి. ఏది చెప్పినా అది అంతరార్థముగానే ఉంటుంది. చిన్నపిల్లవాడు ఉంటాడు. వాడికి మాటలు రావు. అలాంటి పరిస్థితులలో వయఃప్రమాణమును పురస్కరించుకొని 'రామ' అని చెప్పిస్తే అప్పుడా పిల్లవాడు 'లామ' అంటాడు. అది కూడా ఒక అర్థమే. ఆ వయస్సుకు అదే సరైన అర్థము. ఆ వయస్సుకు ఆ సమయానికి 'లామ' అనేది సరైన అర్థము. కానీ మన దృష్టిలోపల 'లామ' అనేది తప్పు.

ఇదేవిధముగా వయఃప్రమాణము, దేహప్రమాణము, సమయ ప్రమాణము, పదప్రమాణము ఇలా అన్ని ప్రమాణములు మనం తీసుకున్నప్పుడే ఇది రైటా? తప్పా? అని నిర్ణయమవుతుంది. ఈనాడు చాలామంది Educated Boys 'చాప' అని పలకమంటే సరిగా పలుకలేరు. 'చాప' అని చెప్పమంటే 'చేప' అంటారు. మీరు యోచనచేసుకోండి. చాపయొక్క తత్త్వము గుర్తించినవాడే ఇది 'చాప' అంటాడు. 'చాప' అర్థము తెలియనివాడు ఎన్ని ప్రయత్నములు చేసినా 'చాప' అనలేడు. భాగవతములో గజేంద్రమోక్ష ఘట్టములో గజరాజును రక్షించేందుకు విష్ణువు బయలుదేరుతున్నాడు. లక్ష్మీదేవి ప్రక్కనుంటున్నది. అతన్ని ఎక్కడికి పోతున్నావని అడగటానికి తగిన సమయములేదు. అప్పుడు ఆమె పరిస్థితిని వర్ణించుటకు పోతన ప్రయత్నము చేశాడు.

అడిగెదనని కడువడి జను
అడిగిన దను మగుడ నుడుగడని నడయుడుగున్
వెడవెడ సిడిముడి తడబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడునెడలన్

చెప్పుతాడో చెప్పడో. పరుగెత్తిపోతుంటే ముడిజారిపోతున్నది. అడుగుపెట్టటానికి లేదు.

sri sathyasai vachanamrutam

అడుగుతీయటానికి లేదు. దేనికీ ఇది సరియైన సమయంకాదు. తుదకు ఏమీచేయలేక నిశ్చేష్టురాలై ఊరకుండిపోయింది. ఒక్కొక్కదేశములో ఒక్కొక్క ప్రాంతములో భాషలు ఆరకంగా ఉంటుంటాయి.

విద్యార్థులారా! ఉపనిషత్తుల అర్థము తెలుసుకోవాలంటే కేవలం ఉపనిషత్తులు అధ్యయనం చేసిన మహనీయులదగ్గరకే వెళ్ళి దాని అంతరార్థము తెలుసుకోవాలి. సర్వోపనిషత్సారము బ్రహ్మతత్త్వమునుండి వచ్చినదే. ఈ బ్రహ్మతత్త్వము వాక్స్వరూపమే. మనోతత్త్వమే, విష్ణుతత్త్వము. విష్ణుతత్త్వము మంచి భావముతో కూడినది. మంచిభావములే ఉండినప్పుడు మంచిపదములే వస్తుంటాయి. మంచిపదములు వచ్చినప్పుడు మంచి అర్థములే వస్తుంటాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులంటే ముగ్గురూ వేరువేరు కాదు. ఆత్మ, మనస్సు, వాక్కు మూడింటి ఏకత్వమే బ్రహ్మ విష్ణు మహేశ్వరతత్త్వము.

## ఉపనిషత్సారములోనే దేహతత్త్వమంతా ఇమిడియున్నది

ప్రేమస్వరూపులారా! ఈవిధంగా మీకు చెప్పుతూపోతుంటే మీకు కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. కారణం ఏమనగా, అర్థము తెలియనివారు, ఉపనిషత్తులు చూడనివారు, ఉపనిషత్సారమును గుర్తించలేనివారు దీనికి అనేక విపరీతార్థాలు తీస్తారు. కనుక, ఉపనిషత్తులు చాలాశాంతముగా, సమయస్ఫూర్తిగా పవిత్రమైన వాతావరణంలో వాక్శుద్ధితో చెప్పాలి. మన శ్వాసకూడా పరిశుద్ధము కావాలి. దీనికి ఉపనిషత్తులలో ఒకవిధమైన మంత్రము చెప్పారు. ఈ మంత్రమువలన అనేకరములైన రోగములు నివారణ అవుతున్నాయి. దీనివల్ల మొట్టమొదట మనశ్వాస పవిత్రమవుతుంది. అంతే కాకుండా హార్టుకు ప్రవహించే చిక్కని రక్తము ఆ మంత్రము చెప్పటంచేత కొంచెం పలుచబడుతుంది. దానివల్ల రక్తప్రసరణ ఏ ఆటంకములేకుండా సాగిపోతుంది. కన్నులకు వచ్చిన క్యాటర్యాక్టు కరిగిపోతుంది. గొంతునుండి వెలువడే శబ్దము కూడా పవిత్రమై పోతుంది. ఒక్క ఉపనిషత్తుల సారాన్నే మనము తీసుకుంటే, దేహముయొక్క తత్త్వాన్ని అంతా గుర్తించుటకు వీలవుతుంది. మన నాలుక ఏవిధంగా రుచి చూస్తున్నది? ఏరకమైన పదార్థములు తీసుకుంటే, ఆ రుచియే గోచరమవుతున్నది. మననాలుకపై వేలకొలది taste buds ఉన్నాయి. కన్నులయందు లక్షలకొలది కాంతికిరణములున్నాయి.

ఉపనిషత్తులలోని మంత్రములను సరిగా ఉచ్చరించినపుడు అనేక రోగములు నివారణఅవుతాయి. అంతేకాకుండా, ఆ మంత్రములయొక్క సరైన అర్థము గుర్తించుకున్నప్పుడు మన ప్రవర్తనకూడా మారిపోతుంది. మన ప్రవర్తన మారినపుడు సరైన భావము మనలో ఆవిర్భవిస్తుంది. సరైన భావము మనలో వచ్చినపుడు సరైన పదముగా రూపొందుతుంది.

ఓంకారమును సరైన పద్ధతిలో ఉచ్చరించండి

ప్రేమస్వరూపులారా! లోకములో ఎన్నియో విధములైన పదములు ఉంటున్నవి. ఎన్నియో విధములైన అర్థములుంటున్నవి. కానీ, అర్థములకు, ఈ పదములకు సన్నిహిత సంబంధ బాంధవ్యము చేకూర్చాలి. ఆధ్యాత్మికతత్త్వములో ఎంతసేపు ఈ అర్థములపైననే దృష్టిని నిల్పడమువలన ప్రయోజనము లేదు. అర్థములతో పాటు సరైన స్వరముకూడా చాలా ముఖ్యము. నేను చాలామందికి చెబుతుంటాను, ఓంకారముయొక్క సరైన ఉచ్చారణను గురించి. 'అ, ఉ, మ్' – ఈ మూడూ చేరితే 'ఓం' వస్తుంది. ఈ 'అ, ఉ, మ్' లో 'అ' అనేది గొంతునుంచి వస్తుంది; 'ఉ' అనేది నాలుకనుండి వస్తుంది; 'మ్' అనేది పెదవినుంచి వస్తుంది. ఈ మూడు చేరిన ఓంకారము నాభినుంచి వస్తుంది. చాలామంది 'ఓం' చెప్పమంటే స్పెల్లింగ్ చెప్తారు. తెల్లవారుజామున 'ఓంకారము' చెప్పమంటే అ,ఉ,మ్ అంటారు. ఈ మూడింటిని సమకాలములో ఉచ్చరించాలి. అదే నిజమైన ఓంకార శబ్దము. 'ఓ..మ్' నాభినుండి రావాలి. కంఠంనుండి వచ్చేటప్పుడు శబ్దము ఎక్కువ వస్తుంది. తిరిగి వెళ్ళిపోయే సమయములో తగ్గిపోతూ వస్తుంది. ఈ శబ్దము సక్రమమైన రీతిలో తీసుకున్నప్పుడే మనకు సరైన భావము కుదురుతుంది. అనేకమంది ఓంకారము ఎన్ని సంవత్సరములో చేస్తుంటారు. "స్వామీ! నేను ఇన్ని సంవత్సరములనుండి ఓంకార నాదము చేస్తున్నాను. భక్తి కుదరడములేదు" అని చెబుతారు. ఎట్లా కుదురుతుంది? సరైన అర్థముతో చేస్తుంటే కదా! ఉపనిషత్తులసారాన్ని చక్కగా గ్రహించండి. మంత్రాలను చక్కగా ఉచ్చరించుకుంటూ రావాలి. అనేకమంది ముసలివారికి పండ్లు లేకపోవటంవల్ల శబ్దములో కూడా మార్పువస్తుంది. సరియైన ఉచ్చారణ తెలిసేవరకు బయటకు ఉచ్చరించనక్కరలేదు. నీమనస్సులో నీవు ఉచ్చరించుకుంటూరా. సంగీతములో కొంతమంది స్వరము పట్టుకుంటారు. ఆ స్వరానికి తగినట్లు గొంతు మార్చుకోవాలి. ఆ

srisathyasaivachanamrutam

గొంతు మార్చుకొనే సమయములో ఆకారమునుకూడా మార్చుకోవాలి. కానీ ఆకారము మారనపుడు, శబ్దము మారనపుడు, వికారమే కల్గుతుంది. చాలామందికి తెలుసు, సంగీతము ప్రారంభించినపుడు స్వరము శ్రుతికి తగినట్లుండాలి. ఆ శ్రుతికి తగినట్లులేకపోతే అపస్వరము వస్తుంది. దీనికి దేహమును కూడా కంట్రోల్ చేసుకుంటూ రావాలి. చాలామందిని భజనలో మీరుచూస్తుంటారు, గట్టిగా పాడినపుడు గొంతు గజందూరం వస్తుంది. గొంతు మారకూడదు. ఇంతదూరము రాకూడదు. దీన్ని కంట్రోలులో పెట్టుకోవాలి. కొంతమంది కన్నులు మూసుకుంటారు. ఒక కన్నుపైకి ఒక కన్ను కిందికి వస్తుంది. వికార స్వరూపంగా చేస్తుంది. అందువలననే హార్మోనియం వాయించే సమయములో దానిపైన ఒక అద్దము పెట్టుకుంటారు. ఆ అద్దము ఎందుకోసమంటే పాటపాడే సమయములో అద్దములో తమ నోరు, తమ కన్నులు ఏవిధంగా మారుతాయో గుర్తించుకోవడము కొరకు. అక్కడ సరైన స్వరములేకపోతే తమ ముఖమే తమకు వికారముగా కనిపిస్తుంది. అలాంటివారు ఎంత మంచిగా పాడినా తమ వికార స్వరూపాన్ని తామే అసహ్యించుకుంటారు. మన ఆకారమువల్ల ఇతరులకు అశాంతి కల్గించకూడదు. కొన్ని పనులు మనము చేస్తుంటాము. ఆ పనులు కూడా సక్రమమైనవిగా ఉండాలి. మనము పాలుత్రాగుతూ ఏదో మాట్లాడుకుంటూ వస్తే ఆ పాలు క్రిందికి తుళ్ళిపోతాయి. అంతేకాక, గొంతుకూడా పాడైపోతుంది. మనము ఏదైనా తినే సమయములో త్రాగేసమయములో మాట్లాడకూడదు. ప్రాచీన కాలములోనున్న మహనీయులందరు కూడా భోజనము చేసేసమయములో నిశ్శబ్దము పాటించేవారు. భోజనానికి ముందు--

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్

అని ప్రారంభించేవారు. ఇంకొక విషయం భోజనము పూర్తిఅయ్యేంతవరకు మాట్లాడకూడదు. లేకపోతే జీర్ణకోశం పాడైపోతుంది. అది పాడైనపుడు ఎన్నిరకములైన జబ్బులో వస్తాయి. ప్రశాంతంగా కన్నులు మూసుకొని భగవంతుని ప్రార్థించి, భోజనము చేయి. చాలామంది పిల్లలకు ఈ విషయము తెలియదు. ప్రశాంతంగా భోజనంచేయాలి. నవ్వుకుంటూ



srisathyasaivachanamrutam

భోజనం చేయకూడదు లేక ఏడ్చుకుంటూ భోజనం చేయకూడదు. రెండూలేకుండా ప్రశాంత హృదయముతో భోజనము చేయాలి. భోజనమునకు ముందు ఏ చింతా చేయకూడదు. నిత్యజీవితములో సత్యజీవితము గడపాలంటే ఈవిధమైన కొన్ని అనుకూలాలు మనము అలవాటుచేసుకోవాలి.

కాల, కర్మ, కారణ, కర్తవ్యాలు ఏకం కావాలి

ప్రేమస్వరూపులారా! 'సాధన', 'సాధన' అనుకుంటారు కాని, సాధన అంత సులభమైనది కాదు. శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, అర్చనం, దాస్యం, వందనం, సఖ్యం, ఆత్మనివేదనం, అని నవవిధ భక్తులను గురించి చెప్పుతుంటారు. ఇది చెప్పడం సులభమే. ఎప్పుడు ఆత్మనివేదనం వస్తుంది? స్నేహం ఏర్పడినతర్వాతనే. స్నేహమునకు పూర్వము ఆత్మనివేదన రాదు. స్నేహము ఏర్పడేవరకు ఆత్మనివేదన సాధ్యముకాదు. స్నేహమైన తర్వాత ఆత్మనివేదన వస్తుంది. అసలు స్నేహమంటే ఏమిటో అనేకమందికి సరిగా తెలియదు. స్నేహమంటే "హలో, హలో" అని పలకరించుకోవడము అనుకుంటారు. ఏమిటీ 'హలో'? కేవలం నోటితో ఉచ్చరించడమే. ఏమీ అర్థము ఉండదు. స్నేహమంటే రెండు దేహములు, ఒక ప్రాణంగా ఉండాలి. అదీ నిజమైన స్నేహమంటే రెండు దేహములకు రెండు భావములు ఉండినపుడు అది స్నేహమే కాదు. A man with dual mind is half-blind అన్నారు. రెండు భావములుంటే dual mind అవుతుంది. ఈ ఖితిబిజి శీరిదీఖి లో పరమాత్మచింతన ఏరీతిగా చేయగలవు? పిల్లలు చాలా సాధన చేయాలని ఆశిస్తున్నారు. వారు చూపించే శ్రద్ధవలన నేను చెప్పాలని ఆశిస్తున్నాను. మీరు మార్గము తప్పకుండా ప్రవర్తించండి. పవిత్రమైనమార్గము మరువకుండా ఉండినపుడే మీకు పవిత్రమైన జీవితము కలుగుతుంది. తప్పక మీరు సాధించగలరు. కాలమును మీరు వ్యర్థము చేయకండి. మీకు తెలియక కాలాన్ని చాలా వ్యర్థము చేస్తున్నారు. కాలమును మనము దుర్వినియోగము చేయకూడదు. కాలమే మనయొక్క జీవితము. "కాలాయనమః, కాలకాలాయనమః, కాలాతీతాయనమః, కాలస్వరూపాయనమః" అన్నారు. అంతా కాలమే, ఇట్టి కాలాన్ని అపవిత్రము చేసుకుంటే ఏరీతిగా తిరిగి కాలము చిక్కుతుంది? కాలమును సార్థకము గావించుకొనేనిమిత్తమై కాలాన్ని నియమించాడు భగవంతుడు. భావాన్ని

సక్రమమైన మార్గములో ప్రవేశపెడితే కర్మలు కూడా సక్రమమైనవిగా ఉండాలి. కాల, కర్మ, కారణ, కర్తవ్యములు ఏకం కావాలి. దేహము అంటే ఏమిటి? water bubbleలాంటిది. అందులో గాలిపోతే పోతుంది. ఏనాటికైనా పోయేదే. నేడు కాకపోయినా రేపైనా పోతుంది. పోయేదానికి మనం విచారించకూడదు. వచ్చింది పోక తప్పదు. పోయింది రాక తప్పదు. కనుక, ఈ రాకపోకలకు మనము విచారణ చేయనక్కరలేదు. రెండూలేని తత్త్వాన్ని మనం గుర్తించాలి. ఏది పవిత్రం, ఏది అపవిత్రం? అలాగే కష్టసుఖాలు కూడా. నా ఉద్దేశములో సుఖముకంటే మనము కష్టములనే ఎక్కువగా కోరుకోవాలి. కష్టమే మనకు సుఖాన్ని అందిస్తుంది. సుఖము కావాలని కోరుకోవడం పొరపాటు. కష్టములే ఆశిస్తూ రావాలి. కష్టములు అనుభవించడంవలన వచ్చిన జ్ఞానము సుఖములో లభించదు. జ్ఞానులు, మహాత్ములు ఎవరినైనా మీరు ప్రశ్నించండి "అయ్యా! ఇంతటి జ్ఞానాన్ని తమరు ఎలా సాధించారు?" అని. ఆయన చెబుతారు "అయ్యా! నేను పడిన బాధలు ఇట్లాంటివికాదు. ఎన్నోబాధలు పడ్డాను. ఇంత జ్ఞానము రావడానికి ఆ కష్టములే మూలకారణము" అని. "కష్టేఫలే" అన్నారు. అట్టి కష్టములు అనుభవించినపుడే మనకు సరైన ఫలితము చిక్కుతుంది. కష్టములో ఉన్న ఆనందము మరొకదానిలో కనిపించదు. కానీ, ఈనాడు జనులు తాము కష్టములు ఏమీ పడకూడదు. "కానీ ఖర్చు కాకూడదు – కైవల్యము ఉట్టిపడాలి". అని కోరుకుంటున్నారు. ఇది అసాధ్యము. నడుము వంచి పనిచేయాలి. చెమటోడ్చి పనిచేయాలి. కేవలము కూర్చొని సుఖాన్ని అనుభవిస్తూ ఉంటే కష్టము బాధగా ఉంటుంది. కష్టము పడిన తర్వాత సుఖాన్ని అనుభవించాలి.

ఒకానొక సమయములో కృష్ణుడు కుంతిని పలుకరించడానికి వచ్చినపుడు ఆమె "ఎప్పుడు వచ్చినావు కృష్ణా! యుద్ధము ఎలా జరుగుతున్నది?" అని అడిగింది. అపుడు కృష్ణుడు "అత్తా! మంచిచెడ్డలు, చావుపుట్టుకలు ఇవన్నీ సహజమే! వాటి చింతన నీవు మానివేసేయి. నీకు ఏమి కావాలో కోరుకో" అని చెప్పాడు. అప్పుడు కుంతి మళ్ళీ "నాకు ఏమీవద్దు కృష్ణా! నేను ప్రాణములువిడిచేంతవరకు నీ పాదకమలములయందు ఐక్యమయ్యేవరకు నాకు కష్టములే ప్రసాదించు" అని కోరింది. ఆ మాటలు విన్న కృష్ణుడు "అత్తా! ఇంతకాలము అనుభవించినది చాలదా? పాండురాజును నీవు వివాహమాడినప్పటినుండి ఈరోజు వరకు కష్టములే అనుభవిస్తున్నావు. ఇంకా కష్టములు ఎందుకు కోరుతున్నావు" అని ప్రశ్నించాడు. దానికి

sri satyasai vachanamrutam

కుంతీదేవి "కృష్ణా! ఈ కష్టములలోని సుఖము నీకు తెలియదు. నాకు మాత్రమే తెలుసు. ఇన్ని కష్టములు నేను అనుభవించడముచేతనే నిరంతరం నీ సాన్నిధ్యమును పొందగలుగుతున్నాను. నా పుత్రులందరూ నీ అనుగ్రహానికి పాత్రులు కాగలిగారు. అదియే నాకు ఆనందం. అలాంటి ఆనందములేక ఎంతమంది పుత్రులు పుట్టి ఏమి ప్రయోజనము?

"కొడుకుల్ పుట్టరటంచునేడ్తు రవివేకుల్ జీవన భ్రాంతులై
కొడుకుల్ పుట్టరే కౌరవేంద్రున కనేకుల్? వారిచే నేగతుల్
వడసెన్? బుత్రులులేని యా శుకునకున్ బాటిల్లెనే దుర్గతుల్?
చెడునే మోక్షపదం బపుత్రునకున్?"

పుత్రులు పుట్టటముచేత కలిగిన ఆనందము లేదు, లేకపోయినా కలిగే నష్టములేదు. పుత్రులు పుట్టినందుకు సత్కీర్తి తేవాలి. సత్ప్రవర్తనలో జీవించాలి. సత్సంగములో చేరాలి. నా కుమారులందరూ భగవంతుని సన్నిధి చేరారు. అందరూ తెల్లవారిలేచి రాత్రి పరుండువరకు 'కృష్ణా! కృష్ణా!' అని స్మరిస్తూ వచ్చారు. అదియే నాకు ఆనందము అట్టి ఆనందము నాకు సదా ప్రాప్తించేటట్లు చేయ"మని ప్రార్థించింది. కానీ, ఈనాటి తల్లులు ఈవిధంగా కోరుతారా? కోరరు. కొడుకు బాగానే ఉండాలి. కానీ, దైవసన్నిధికి చేరాలని ఆశించరు. 'దైవసన్నిధికి పోతే నాకొడుకు ఏమౌతాడో ఏమో!' అని భయపడతారు. దైవసన్నిధికి చేరటమే కావాలి. దానిని చేరకుండా ఎక్కడో కూర్చుంటే ఏమి ప్రయోజనము? పుట్టినందుకు ఎక్కడ చేరాలో అక్కడే చేరాలి.

పట్టిన పట్టేదే పట్టనే పట్టితివి
పట్టునెగ్గెడుదాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితివి
కోర్కెచెల్లెడుదాక కొలిచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితివి
అడిగినదిడుదాక విడువకుండు
తలచినదేదియో తలచనే తలచితివి
తలపుతీరెడుదాక తరలకుండు

sri sathyasaivachanamrutam

పోరుపడలేక నేనైన బ్రోవవలయు
ఒడలుతెలియక నీవైన అడుగవలయు
అంతియేగాని మధ్యలో ఆపివేసి
తిరిగిపోవుట భక్తుని దీక్షకాదు.

భగవంతుని సన్నిధిలో దుఃఖము, విచారము, ఏవిధమైన బాధలు ఉండవు

ఈజీవితములో ఎన్నో కష్టాలు, నష్టాలు, దుఃఖాలు వస్తుంటాయి. వాటిని లక్ష్యపెట్టకూడదు. దైవసన్నిధి నీపెన్నిధిగా భావించాలి. అచంచలమైన భక్తి పెరగాలి. అవిశ్వాసమనే ఆలోచనే రాకుండా ఉండాలి. నిత్యసత్యమైన దైవత్వముపైన అచంచలమైన భక్తి రావాలి. అదియే మనకు కావలసినది. నిశ్చలమైన, నిర్మలమైన, నిస్వార్థమైన భక్తి కావాలి. ఈనాడు మానవునికి అన్నీ కావాలి. ఇక్కడ ఇది కావాలి. అక్కడ అదీ కావాలి. ఎట్లా లభిస్తుంది? ఉన్నది ఒకనోరు. ఆనోటితో పాలుత్రాగాలి, నీరుత్రాగాలి అంటే సాధ్యమా? పాలు, నీరూ కలుపుకుంటే సరి! కాబట్టి హృదయములో ఒకే ఒక వస్తువును మనము కోరాలి. అదియే దైవత్వము. ఆ దైవత్వాన్ని కోరితే అన్ని తత్త్వాలూ మనకే వస్తాయి. దైవమే అన్ని విధాలా చూచుకుంటాడు. మానవ జీవితమునకు ఏది ప్రధానమైనది? ఏది సుఖమైనది? ఏది శాశ్వతమైనది? ఏది ఆనందము నందించేది అని విచారిస్తే భగవంతునియొక్క సన్నిధియే. భగవంతుని దగ్గర దుఃఖము లేదు. భగవంతుని దగ్గర అశాంతి లేదు. భగవంతుని దగ్గర విచారములేదు. భగవంతుని చేరితే దుఃఖము, విచారము, ఏవిధమైన బాధలు ఉండవు. ఎవరోవచ్చి “స్వామీ! నేను పరమాత్ముని భక్తుడను కానీ, నిరంతరము దుఃఖముగానే ఉంటుంది” అని బాధపడ్డాడు. అప్పుడు నేను చెప్పాను: “నిజంగా నీవు భక్తుడే అయితే, ఈ దుఃఖము నీకు ఎందుకు వచ్చింది? నీవు భగవంతుని నుండి అందుకొనే పదార్థము సుఖమైనదే గాని, దుఃఖమైనదికాదు కదా! భగవంతుడు ”దుఃఖాన్ని అందించడు. తనదగ్గర ఆ దుఃఖము లేదు. నీవు అందుకొని అనుభవించేది భగవంతుని దుఃఖము కాదు. ఎవరిదో నీవు తీసుకొని భగవంతుడు ఇచ్చాడు అంటే సరిపోతుందా? భగవంతుడు దుఃఖము ఎప్పుడూ ఇవ్వడు. భగవంతుడు ఎప్పుడూ సుఖాన్నే ఇస్తాడు. “మమైవాంశో జీవలోకే జీవ భూతస్సనాతనః” నా అంశములో ఉండేవానికి నాయొక్క భావములే

srisathyasaivachanamrutam

వస్తాయి. నా ప్రసాదమే మధురమైనదిగా వస్తుంది. భగవంతునినుండి అందుకొనే ప్రసాదము చేదు వస్తుందా? ఎప్పటికీ రాదు,” కొంతమంది అజ్ఞానముచేత ఆవిధంగా భావిస్తుంటారు.

మధ్వాచార్యులు ద్వైత సిద్ధాంతమును స్థాపించిన గొప్ప భక్తుడు. ఆయన కన్నడదేశములో ఉండేవాడు. కృష్ణభక్తుడు. ఒకసారి ఆయన తన శిష్యులను పిలిచి “రేపటి దినము భీష్మఏకాదశి. మీరందరూ ఏకాదశి వ్రతమును పాటించండి అని చెప్పాడు. శిష్యులు మూడుదినములు అన్నపానీయములులేకుండా నిరంతరం దైవాన్ని చింతించుతూ వచ్చారు. ఆ రోజు రాత్రి మధ్వాచార్యులు వారికి కలలో కనపడి ‘కేవలం ఆచారములను పట్టుకొని ప్రాకులాడవద్దు. ఇది కాదు సాధన. సిద్ధాంతముల తత్త్వము వదలవద్దు. నా జీవితములో నేను అనుభవించినది ఇదే’ అని చెప్పారు. ఈనాడు జనం “అయ్యా! ఏకాదశి, ఏకాదశి” అని మూడు దినాలు పస్తుంటారు. నాల్గవ దినము 40 దోశెలకు పిండి కలుపుకుంటారు. ఇదేనా ఏకాదశి. నాల్గవదినము దోశ కాదు, ప్రేమను చేర్చాలి. ఆ ప్రేమ ప్రవేశిస్తే ఎట్టి ఆకలి ఉండదు. ఆకలి దప్పులు మరచిపోవుటకే ఈవిధమైన సో-హం తత్త్వాన్ని చెప్పారు.

## ప్రపంచములో శాంతిని నెలకొల్పుటకే మహనీయులు మంత్రోపదేశం చేస్తారు

ఒక సందర్భంలో విశ్వామిత్రుడు తాను తలపెట్టిన యజ్ఞసంరక్షణకై రామలక్ష్మణులను తీసుకొని పోతున్నాడు. దశరథ మహారాజు కుమారులు సుకుమారులు, ఇంతవరకు ఎలాంటి కష్టములూ అనుభవించినవారు కాదు; అందుచేత వారు అరణ్యములో ఏమి బాధపడతారో అని బాధపడతాడు దశరథుడు. సరయూ నదీతీరమునకు పోయేటప్పటికి “రామా! లక్ష్మణా ఇటు రండి” అని పిలిచాడు విశ్వామిత్రుడు, వారు ఆనందహృదయముతో దగ్గరికి వెళ్ళారు. అప్పుడు ఆ మహర్షి వారికి ‘బల, అతిబల’ అనే రెండు మంత్రాలు ఉపదేశించాడు. “రాముడు అవతారపురుషుడని తెలిసికూడను వారికి మంత్రోపదేశము ఎందుకు చెయ్యాలి,” అని చాలామంది ఈ సందర్భమును గురించి వాదిస్తూ వచ్చారు. రామలక్ష్మణులు దివ్యపురుషులైనప్పటికి ఆహారవిహారములలో ఉంటున్నది కదా దేహము. కనుక, ఆకలికాకుండా ఉండే నిమిత్తము ఒక మంత్రము; నిద్రరాకుండ ఉండేందుకు ఒక మంత్రము; రెండు మంత్రములను ఉపదేశించాడు. ఈ ఆహార నిద్రలు రెండూ లేకపోతే ఎంత సాధన అయినా

srisathyasaivechanamrutam

చేయవచ్చును. ఎంతటి భయంకర యుద్ధములోనైనా విజయము సాధించవచ్చును. ఎంతటి రాక్షసులనైనా జయించవచ్చును. కొంతదూరము పోయిన తరువాత లక్ష్మణుడు ప్రశ్నించాడు. "స్వామీ! ఎందుకు నాకీ మంత్రోపదేశము చేయటము" అని. దానికి విశ్వామిత్రుడు "నాయనా! మీరు సుకుమారపుత్రులు, ఆకలి జఠరాగ్ని. ఆకలి కాకుండా ఉండాలి. మీరు భోజనంచేస్తూ ఉంటే ఎక్కడ వస్తుందో తాటకి; నిద్రపోతూ ఉంటే ఈ రాక్షసులు ఎక్కడ వస్తారో ఏమిటో; కాబట్టి దృష్టి రాక్షసులపైనే పెట్టాలి. ఈ 'బల, అతిబల' అనే మంత్రములు రెండూ జపించటంవలన నిద్ర, ఆకలి రెండూపోయి మీరు నిరాఘాటంగా యాగసంరక్షణ చేయగలరు" అని బోధించాడు. శాంతి కారణనిమిత్తమై మహనీయులు మంత్రోపదేశము చేస్తుంటారు. అందువలన "రాముడు అవతారపురుషుడని తెలిసికూడా మంత్రోపదేశం ఎందుకు చేశాడు" అని పిచ్చి ప్రశ్నలు వేయకూడదు. కేవలము మనుష్యులని కానీ, దేవుడని కాని మంత్రోపదేశము చేసింది కాదిక్కడ. సమయసందర్భానుసారంగా ప్రవర్తించే నిమిత్తమే. విద్యార్థులారా! రేపటిదినము విష్ణువుయొక్క తత్త్వాన్ని తప్పక బోధిస్తాను. అది మరింత సులభంగా ఉంటుంది. ఆత్మ, మనస్సు, వాక్కు ఈ మూడింటి ఏకత్వమే ఉపనిషత్ సారము. దీనిని గురించి రేపటిదినము తెలుసుకుందాం.

(తేది 12-10-2002 సాయంత్రము సాయికుల్వంత్‌హాల్‌లో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)

sri sathyasai vahanamrutam